# మినీ కథలు.

## నమ్మకం



సునంద

### విక్రమార్కుడు పట్టువదలేదు.

అప్పటికి నాలుగు సార్లు అసెంబ్లీకి నిలబడి చిత్తుగా ఓడిపోయాడు. విక్రమార్కుడు ఎలాగైనా సరే ఎం. ఎల్. ఏ. కావాలని, లీడరుగా మంచిపేరు తెచ్చుకోవాలని పట్టుదలగా వున్నాడు. ఎలాగో తంటాలుపడి ఐదోసారి కూడా టిక్కెట్టు సంపాయించుకోగలిగాడు. ఆ సంపాయించుకున్న టిక్కెట్టు జేబులో పెట్టుకొని ఆనందంతో చిందులు తొక్కుతూ ఇంటిముఖం పట్టిన తరుణంలో-విక్రమార్కుడి జేబులో వున్న టిక్కెట్టుకు ప్రాణం వచ్చి మాట్లాడటం ప్రారంభించింది—

"విక్రమార్కా! నాలుగుసార్లు ఓడిపోయి మళ్ళి నా కోసం నానా హైరానాపడి నిలబడుతున్నావు- ఐదోసారి! ఇలా నీలాగా టిక్కెట్టుకోసం నానా ప్రయాసలుపడి బోలెడు డబ్బు ఖర్చుపెట్టి సోదిలోకి కూడా రాకుండా పోయినవాళ్ళు చాలామంది వున్నారు. అలాంటి ఒక ఓడిపోయిన లీడరు కథ నీకు చెబుతాను. ఆలకించు!' కొన్ని సంవత్సరాలకు పూర్వం ఒక వూళ్లో బకాసురుడికి ఎం. ఎల్. ఏ. కావాలనిపించింది. తాత ముత్తాతల నాటి ఆస్తిసొంతం కరగలేదు! కరిగించకుండా ఇంకొంచెం మిగిలింది! ఆ ఆస్తి చూసుకొని ఎన్నికల్లో పోటీ చేశాడు. ఘనంగా ఓడిపోయాడు. ఇలా ఐదు సార్లు నిలబడి. ఐదు సార్లూ ఓడిపోయాడు. ఉన్న ఆస్తి కాస్తా హళ్ళికి హళ్ళి సున్నకు సున్నా అయింది. బకాసురుడు కాస్తా బక్కచిక్కి బకంలాగా తయారయ్యాడు"

టిక్కెట్టు ఒక్క క్షణం ఆగి—

"ఏమయ్యా! మార్కుడూ! నాకో సందేహం వచ్చింది! ఒకసారి చిత్తుగా ఓడిపోయిన ఆ బకాసురుడు మాటిమాటికీ ఎలక్షన్‌లో ఎందుకు నిలుచున్నటు? ఉన్న కొద్దిపాటి ఆస్తికూడా ఎందుకు కరిగించేసుకున్నట్టూ? ఈ ప్రశ్నకు సమాధానం తెలిసి వుండికూడా చెప్పకపోయావూ- నీ తల వెయ్యి చెక్కలవుతుంది- చెప్పు" అని టిక్కెట్టు రెట్టించింది.

అప్పుడు విక్రమార్కుడు ఇలా చెప్పాడు.

"నిజమే! బోలెడు ఖర్చుపెట్టి ఎలక్షన్లలో నిలబడ్డాడు. మాటి మాటికీ ఓడిపోయాడు. ఊరుకోవాల్సిందే. అయితే అతను అనుకున్నదేమిటంటే ఎలక్షన్‌లోగెలిస్తేమటుకు పాతిక సంవత్సరాల కాలంలో పోగొట్టుకున్న ఆస్తి యావత్తూ ఐదు సంవత్సరాల్లో రాబట్టుకోలేనా అని. ఆ నమ్మకంతోనే ఐదుసార్లు నిలబడ్డాడు."

---

### మీనాక్షి బాగా పాటలు పాడుతుంది.

## నగుమోము గనలేని..



వై.పి.వి.రెడ్డి

శాస్త్రీయ సంగీతాన్ని నేర్పించాలని తల్లి ఎంతగానో ప్రయత్నించింది. కుదరలేదు. అట్లని మీనాక్షికి సంగీతం వంటపట్టలేదా అంటే నేను వొప్పుకోను. ఆమె పాడే కృతుల్లో "నగుమోము గనలేని . ." కృతి నన్నెంతగానో ఆకర్షించింది.

ఆమెది ఒక విచిత్రమైన వ్యక్తిత్వం దేనికీ శ్రద్ధ చూపించేది కాదు. దేనికీ కట్టుబడేరకం కాదు. మంచికంఠం. సంగీతంలోని వొదుగు ఎవరైనా ముగ్ధుల్ని చేస్తుంది. నామటుకు నాకు, ఆమెను చూస్తేనూ - మాట్లాడితేనూ తృప్తి. ఆమె ఏమి చదువుతోందో తెలియదు. చదువుకు ఎప్పుడు స్వస్తి చెప్పిందో కూడా తెలియదు. దాదాపు మూడు నాలుగేళ్ళు ఆమె సంగీతాన్ని అప్పుడప్పుడు విని ఆనందించాను. అంతే. ఆమెకు మంచి భవిష్యత్తుందని గట్టిగా అనుకున్నాను ఆమెకు అప్పటికి 15.16 ఏళ్ళు. ముద్దుగా వుండేది. ఎప్పుడూ నవ్వుతూ వుండేది. ఆమె పాట, ఆమె నవ్వు మొగము నేను మరచిపోలేదు. ఎన్నో ఏళ్ళుగా ఆమెను చూళ్ళేదు. నా జీవితం ఆమె సాన్నిధ్యంనుంచి దూరంగా వుండి 30 ఏళ్ళయింది. ఆమె ఎవరో నేనెవరో ఎన్ని ఏళ్ళు నా మనస్సులో మెదలిందీ! అనుకొంటే చాల విచిత్రంగా వుంటుంది.


మూడు నాలుగేళ్ళ క్రిందట ఒకసారి అనంతపురంలో ఒక తియ్యని కంఠం పలుకరించింది. ఎవరా అని ఆశ్చర్యంగా నిలిచిపోయాను. గుర్తు పట్టలేనందుకు సిగ్గుపడుతూ వుంటే "ఏమప్పా నేను మీనాక్షిని "నగుమోము గనలేని" అని కొంటెగా హెచ్చరించింది. ఎంత ఆనందం పొందానో చెప్పలేను. ఆమె నన్ను కనుక్కొంది. నేనామెను గుర్తుపట్టలేకపోయాను. చాలా సిగ్గుపడ్డాను. రెండు మూడు క్షణాలు మౌనంగా ఒకరినొకరు చూసుకొన్నాం.

"మీనాక్షీ ఎంత మారిపోయావు!" అని అన్నాను. ఆమెలో ఒక కలిక బయలుదేరింది. విపరీతమైన బాధ శరీరమంతా ఆవరించిందేమో. మీనాక్షి మొగముదీనమైపోయింది. కన్నుల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. నాకు అంతుపట్టలేదు ఆమెను ఎట్లా ఓదార్చాలో నాకు తెలియలేదు.

## గాథావళి :

# పూలు : ముండ్లు

హైదరాబాదు సంస్థాన విభజన జరగక ముందు శాసన సభలో ప్రముఖ ఉర్దూ కవీ, నా మిత్రుడూ మఖ్దూం ప్రతిపక్ష సభ్యుడుగా వుండేవాడు (తరువాతా వున్నాడు). డాక్టర్ బూర్గుల రామకృష్ణ రావుగారి మంత్రిమండలిలో పూల్ చంద్ గాంధీ విద్యా మంత్రిగా ఉండేవారు. ఆయన శాసనసభలో విద్యా విధానానికి సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టినప్పుడు మఖ్దూం లేచి "పూల్ చంద్ జీ! ఇస్మేం పూల్ చంద్ ఔర్ కాంటే జ్యాదా" (పూల్ చంద్ గారూ! ఇందులో పూలు తక్కువ. ముండ్లు ఎక్కువ) అన్నాడు.



అంతా విరగబడి నవ్వారు. సమయస్ఫూర్తికి మఖ్దూం పెట్టింది పేరు.

—దాశరథి

"ఏం ఎందుకు బాధపడతావు కాఫీ తాగుతూ మాట్లాడుకొందాం రా" అని హోటలువైపు దారితీశాను. మీనాక్షి మౌనంగా వస్తూంది.

ఆమెకెందుకు బాధ. ఆమె దుఃఖానికి కారణమేమైవుంటుందో! అడుగుతే చెప్తుందా? అని ఆలోచిస్తూ- హోటల్లో కూర్చున్నాం. కాఫీకి ఆర్డరిచ్చాను.

"మీనాక్షీ. ఎన్ని ఏళ్ళయిందో నిన్ను చూసి. వెంటనే గుర్తుపట్టలేకపోయినాను. క్షమించు" - అని అన్నాను. "ఫరవాలేదు నేను బహుశా బాగా మారిపోయాను. నీలో ఏ మార్పూలేదు. అందుకే నిన్ను గుర్తుపట్టి పలకరించాను. చూస్తూనే ఎన్నో ఏళ్ళనాటి పరిచయాలు జ్ఞప్తికి వచ్చినాయి. దుఃఖం వచ్చింది. క్షమించు"అని అన్నది. "నాకు చాలా ఆనందం కలిగింది మీనాక్షీ!" అని అన్నాను. చిన్న నవ్వు నవ్వింది. అందానికి తెర తీసినట్లుంది ఆ నవ్వు. కాఫీ వచ్చింది. త్రాగుతున్నాం. మీనాక్షి సిగ్గు పడుతూవున్నట్లుంది. మౌనంగా వుంది.

"మీనాక్షీ ఏం సంగతులు. ఎక్కడున్నావ్. ఏం చేస్తున్నావ్" అనిఅడిగాను. 'ఏముందీ చేసేదానికి' అని "నీవేం చేస్తున్నావ్. ఎక్కడున్నావ్ బాగున్నావుకదా" అని ఆప్యాయంగా అడిగింది. ఆమెలో నా క్షేమాన్ని తెలుసుకోవాలనేవుందిగానీ ఆమె విషయాలు చెప్పాలని వున్నట్లులేదు. "పరవాలేదు బాగానే వున్నాను. ఏముందీ మా లాంటి సామాన్యమానవులకు. జీవితమంతా సామాన్యమే" అని అన్నాను.

మీనాక్షి యీసారి ఎందుకో నవ్వలేదు. గంభీరంగా నావైపు చూసింది. మౌనంగా వుండిపోయింది. మీనాక్షిలో అందం యింకా పూర్తిగా జారలేదు. కొడిగట్టుకున్న దీపంలా వెలుగుతూనేవుంది. "నేనక్కడే వుంటున్నాను. సంగీతం మేష్టారుగా " అనిచెప్పి "యింటికి వస్తావా అని పిలిచింది." "ఎందుకు రానూ పద" అని బయలుదేరాను.

మీనాక్షి వెంట ఆలోచిస్తూ నడుస్తున్నాను మీనాక్షిని చూడడం జీవితంలో ఎంత మంచి సంఘటన! యింతవరకూ ఆమె ఏ విషయమూ చెప్పదేం. ఏదో దాచుకొంటూవుంది. నే నేమనుకొంటానో అని సంకోచపడుతూ వుందా? ఏమనుకొనడానికి ఏముంది? ఎవరి దారి వారిది. సంగీతం మాష్టరుగా స్థిరపడినందుకు చాలా ఆనందం కలిగింది. సంగీతం బాగా ప్రాక్టీసు చేసివుంటుంది. మీనాక్షితో ఆ కృతి పాడించుకొంటే? పాడుతుందా? తప్పక పాడుతుంది. మీనాక్షి మంచిది. ఏవేవో తియ్యటి ఆలోచనలు!

అంతలోనే 'యిదే మా యిల్లు' అని నన్నాహ్వానించింది. యింట్లో ఎవ్వరూ లేరు. నిశ్శబ్దంగా వుంది. చిన్న యిల్లు. హాల్లో చాపవేసి కూర్చోమంది. హాల్లో ఒక మూల వైలన్ వుంది.

"మీనాక్షీ యింట్లో ఎవ్వరూ లేరా"అని అన్నాను. "ఎవ్వరూ లేరు ఉండడానికి. నేను ఒంటరిదాన్ని. నాకు దిక్కూ తోడూ ఆ వైలన్" అని వెక్కి వెక్కి ఏడుస్తూ కూలబడిపోయింది. ఏమీ తోచ లేదు. నా గుండె బరువెక్కింది. ఆమెను ఓదార్చే శక్తి నాలోలేదు. ఆమెజీవితంలో ఏవిచారం వుందో తెలియదు. ఆమె యిప్పుడు ఒంటరిగా బతుకుతూవుంది. చాలా సేపటికి మీనాక్షి తేరుకుంది. కళ్ళు తుడుచుకొంది. నేనూ బాధపడుతున్నానని తెలుసుకొంది. కాలం మమ్మల్ని ఓదార్చింది.

నాకోరిక ఎట్లా తెలుసుకొందో - వైలన్ సరిచేసి - "నగుమోము గనలేని" అన్న కృతి కమనీయంగా పాడింది. మీనాక్షి ఉజ్జ్వలంగా భాసించింది. ఆమె సంగీతం కలలను పండించింది. ఆమె ఒక మెరుపు తీగెలా నన్ను చకితుడ్ని చేసింది. చిన్నప్పటికీ, యిప్పటికీ ఏమీ తేడాలేదు. యింకా ఆ కృతి పాడడంలో మెరుగులు దిద్దుకొంది. అది మనోహర సన్నివేశం నా జీవితంలో - అని అనుకొన్నాను.

"మీనాక్షీ నాకేవైనా విషయాలు చెప్పేవి వున్నాయా" అని అన్నాను. "ఏమీలేవు మీరెప్పుడు వచ్చినా నన్ను చూడకుండా పోవద్దు. ఈ జీవితానికి యింత మాత్రం వూరట విధిగా కావలసివుంది" అని చెప్పింది.

ఎంత గొప్ప సంస్కారి! ఈ లోకం ఆమెను ఒంటరిదాన్నిచేసి బాధించింది.

